క్లుప్తంగా

కౌలు గుర్తింపు కార్డుల పంపిణీ



రాకోడులో రైతులకు కౌలు గుర్తింపు కార్డులు అందిస్తున్న సర్పంచ్ వెంకటరమణ

విజయనగరం రూరల్: అర్హులైన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.ఉమామహేశ్వరనాయుడు తెలిపారు. మండలంలోని రాకోడు, కోరుకొండ గ్రామాల్లో కౌలు రైతులకు సోమవారం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. గుర్తింపు కార్డులు కలిగి ఉన్న రైతులకు ప్రభుత్వం నుంచి చేకూరే ప్రయోజనాలను వివరించారు. అర్హత ఉన్న రైతులు రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు.

పూడికతీత పనుల పరిశీలన



బట్టికాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

భోగాపురం: మండల కేంద్రంలోని బట్టికాలువలో పంచాయతీ అధికారులు చేపట్టిన పూడికతీత పనులను ఎమ్మెల్యే లోకం నాగమాధవి సోమవారం పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా త్వరలోనే పూర్తిస్థాయిలో బట్టికాలువ నిర్మాణాన్ని చేపడతామన్నారు. ఆమె వెంట జనసేన పార్టీ నాయకులు వరుపుల సుధాకర్, పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు, మాత నవీన్‌కుమార్, ఈఓపీఆర్డీ సురేష్, పంచాయతీ సెక్రటరీ మంగం సురేష్ ఉన్నారు.

వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వీఓఏలు

విజయనగరం ఫూల్‌బాగ్: ఎల్.కోట మండలంలో పనిచేస్తున్న 16 మంది వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలని వీఓఏలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, వెలుగు ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి.లక్ష్మి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలరోజుల్లోనే చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు దిగి, వారిని తొలగించడం అన్యాయమన్నారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఎం.శ్యామల, టి.బంగారమ్మ, ఎస్.లక్ష్మి, త్రివేణి, రాధ, ఈశ్వరమ్మ, సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

నీట్ రద్దు చేయాలని డిమాండ్

విజయనగరం అర్బన్: వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్-2024లో పారదర్శకత లోపించిన కారణంగా పరీక్షను రద్దు చేసి ప్రతిభావంతులైన విద్యార్థులకు న్యాయం చేయాలని అంబేడ్కర్ రైట్స్ ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఫోరం సభ్యులు నిరసన చేపట్టారు. అనంతరం నీట్ పరీక్ష రద్దుకు శాసనసభలో తీర్మానం చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు రాసిన బహిరంగ లేఖను ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు భానుమూర్తి కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో ఫోరం సభ్యులు పూసర్ల మధుసూదనరావు, జలగడుగుల రాజ్‌కుమార్ ఉన్నారు.

ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం

విజయనగరం రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. ఉచిత ఇసుక పాలసీ అమలులో భాగంగా స్థానిక అశోక్ బంగ్లాలో సోమవారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఇసుక ధర ఆకాశాన్నంటిందన్నారు. ఉచిత ఇసుక పాలసీతో నిర్మాణ రంగం పురోగతి సాధిస్తుందన్నారు. జిల్లాలో కొత్తవలస, డెంకాడ, బొబ్బిలి ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగి మృతికి సంతాపం

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన బోలె శ్రీను(48) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. శ్రీను కబడ్డీలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి ఇండియన్ ఆర్మీలో సేవలందించారు. ఉద్యోగ విరమణ అనంతరం పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో సేవలందిస్తున్నారు. మరోవైపు కబడ్డీపై ఉన్న మక్కువతో ఖాళీ సమయంలో యువతకు కబడ్డీలో శిక్షణ ఇచ్చేవారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీను భౌతికకాయానికి పలువురు నివాళులర్పించారు.

కలెక్టర్‌ని కలిసిన డ్రైవర్లు

విజయనగరం అర్బన్: జిల్లా అధికారుల అద్దె వాహనాల యజమానులు, డ్రైవర్లు సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న తరువాత ఆయన్ను కలిసి జ్ఞాపిక ఇచ్చి అభినందనలు తెలియజేశారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో సంతోష్, మోహన్, నర్సింగరావు, అనిల్, ఉమ, సతీష్, రమణ, శంకర్, తదితులు ఉన్నారు.

జనహృదయ నేతకు జోహార్



పూసపాటిరేగ: కుమిలిలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పేద ప్రజల సంక్షేమానికి పరితపించిన నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన అమలు చేసిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, వంటి అనేక సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. జలయజ్ఞంతో రైతులు కళ్లల్లో ఆనందాన్ని నింపిన మహానేత. సోమవారం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఆయన అభిమానులు పెద్ద ఎత్తున వేడుకలు చేసుకున్నారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ వైఎస్సార్.. అంటూ నినాదాలు చేశారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిద్దామని నేతలు పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



డెంకాడ: పెదతాడివాడలో రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



డెంకాడ: డెంకాడలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కనక సింహాచలం, వైస్ ఎంపీపీ తమ్ము నాయుడు, తదితరులు



విజయనగరం: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు, కార్పొరేటర్లు



విజయనగరం ఫోర్ట్: కార్పొరేషన్ కార్యాలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి సతీష్‌కుమార్, తదితరులు



పూసపాటిరేగ: కోనాడ ఎస్సీ కాలనీలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు



విజయనగరం రూరల్: జొన్నవలసలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, తదితరులు



విజయనగరం: 14వ డివిజన్ కొత్తపేటలో వైఎస్సార్ జయంతి వేడుకలు



విజయనగరం: దాసన్నపేటలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న పార్టీ నాయకులు

జీతాలు ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం చూపుతున్న జనరల్ డ్యూటీ అటెండర్లు, ఆఫీస్ సబార్డినేటర్లు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న 12 మంది ఆఫీస్ సబార్డినేట్లు, 12 మంది జనరల్ డ్యూటీ అటెండర్లకు 11 నెలలుగా జీతాలు అందక ఇబ్బంది పడుతున్నామని వారంతా వాపోయారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నమన్నారు. పలుమార్లు ఆస్పత్రి అధికారులను కలిసి జీతాలు అందించాలని కోరినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందిని, రవాణ చార్జీలకు కూడా డబ్బులు లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. మా జీతాలు గురించి అడిగితే ఇదుగో, అదుగో అంటున్నారే తప్ప మా సమస్య పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కళ్యాణ్, గౌస్, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

నేడు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

విజయనగరం: రోటరీ క్లబ్ (విజయనగరం సెంట్రల్) నూతన కార్యవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. ఈ సందర్భంగా పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, ఆర్.శంకరరెడ్డి తెలిపారు. పట్టణంలోని రోటరీ ఆరోగ్య కేంద్రం సింహాచలం మేడలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం స్థానిక సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయానికి బెంచీలు వితరణ, ఉడా కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం, ఎస్ఆర్‌బి ఆస్పత్రిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం, తదితర సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 50 మంది సభ్యులతో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తుందని తెలిపారు. కార్యక్రమానికి రోటరీ ప్రతినిధులతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. అలాగే యువత స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రోటరీ ప్రతినిధులు టీఎల్ఎస్ మూర్తి, జి.శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పూసపాటిరేగ: అప్పలనాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు



భోగాపురం: వెంకటరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని పేరాపురంలో ఇటీవల మృతిచెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బొంతు అప్పలనాయుడు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సోమవారం పరామర్శించారు. అప్పలనాయుడు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం పేరాపురం సర్పంచ్ రౌతు శ్రీరామ్మూర్తి తల్లి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, బొంతు రవికుమార్, బొంతు ఉమాదేవి, తదితరులు ఉన్నారు.

వెంకటరావు కుటుంబాన్ని పరామర్శ

భోగాపురం: ఇటీవల అనారోగ్యంతో మరణించిన భోగాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సుందర వెంకటరావు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సోమవారం పరామర్శించారు. ముందుగా వెంకటరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అతని కుమారులు సుందర వెంకటేష్, హరీష్‌లతో మాట్లాడి ఓదార్చారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల శ్రీనివాసరావు, కొయ్య బంగార్రాజు, అడపా ప్రసాద్, పోతిరెండి గోపి, ఆళ్ల మాధవరావు, తదితరులు ఉన్నారు.

అరాచక శక్తులు ఎంతటివారైనా వదలం

- మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: కోనాడ గ్రామంలో దివగంత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన అరాచక శక్తులు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. కోనాడ గ్రామంలో ధ్వంసం అయిన రాజశేఖరెడ్డి విగ్రహాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసేవిధంగా చట్టం పనిచేస్తుందని అన్నారు. రాజకీయ పరిపక్వతలేని వ్యక్తులు అధికారంలోకి రావడంతో పావలాకు కూడా చెల్లని వ్యక్తులను అందలం ఎక్కించి ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నారన్నారు. విత్తనాల పంపిణీలో, పాఠశాలలో పుస్తకాలు పంపిణీలో స్థానికంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను కాదని అధికార పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తున్న అధికారులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. తక్షణమే ఒంటెద్దు పోకడలు వీడి ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని అన్నారు. ప్రజలచే ఎన్నికైన ప్రజాప్రతినిధులను ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవకపోవడంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, దాడిశెట్టి త్రినాథరావు, బొడ్డు ఎల్లాజీ, దారపు లక్ష్మణరెడ్డి, దాడిశెట్టి గోవింద, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భోగాపురం: మండలంలోని ముక్కాం, కొండ్రాజుపాలెం, రామచంద్రపేట, చోడిపల్లిపేట, తోటపల్లి, సబ్బన్నపేట, బోయపాలెం, ఎం.పాలెం, చేపలకంచేరు, గాబువానిపేట, ముంజేరు, నందిగాం, అప్పన్నపేట గ్రామాల పరిధిలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ జి.సురేష్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతు పనులు చేపడుతున్నందున సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

గోవధ శాలలను మూసివేయాలి

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌కు సమీపంలో ఉన్న గోవధ శాలలను మూసివేయాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకుని అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. గో హంతకులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, గోవధ కేంద్రాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, వివిధ సంఘాల ప్రతినిధులు రాజకుమారి, మద్దిలి సోంబాబు, రవిశంకర్, నీలాపు దేవి, గండికోట శాంతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్జీలు నిల్

విజయనగరం రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారుల నుంచి ఎటువంటి వినతులు అందలేదు. ఉదయం 10 గంటల నుంచి ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈవోపీఆర్డీ డి.తిరుపతినాయుడు, వివిధ శాఖల అధికారులు అర్జీల స్వీకరణకు అందుబాటులో ఉన్నారు. అర్జీలు ఇచ్చేందుకు ఎవరూ రాకపోవడంతో కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌ను వీడియో కాన్ఫరెన్స్‌లో తిలకించారు.

బకాయి జీతాలు చెల్లించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు ఏప్రిల్, మే, జూన్ నెలల వేతనాలు, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పనిచేసిన వారికి రెమ్యూనిరేషన్ ఇంతవరకు అందలేదని, అధికారులు స్పందించి తక్షణమే బాకాయిలు చెల్లించాలని శానిటేషన్ వర్కర్లు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు బి.సుధారాణి, ఎ.జగన్మోహనరావు, కార్మికులు ఎస్‌కే బేగం, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చేయూత లబ్ధిదారుల ధర్నా

విజయనగరం ఫూల్‌బాగ్: అర్హులైన లబ్ధిదారులందరికీ చేయూత డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ డెంకాడ మండలం పెద్ద తాడివాడ గ్రామ మహిళలు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. వారికి శ్రామిక మహిళ జిల్లా నాయకులు బి.సుధారాణి, సీఐటీయూ నగర అధ్యక్షుడు ఎ.జగన్మోహనరావు మద్దతు తెలిపారు. ప్రభుత్వం స్పందించి చేయూత అర్హులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు.

స్టూడెంట్ కిట్లు అందజేత



స్టూడెంట్ కిట్లు అందుకున్న విద్యార్థులతో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు సోమవారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కంది చంద్రశేఖర్, సర్పంచ్ కంది కిరణ్‌కుమార్ చేతులమీదుగా విద్యార్థులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎన్ని అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి అన్నారు. ఒమ్మి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం సతివాడలో ఉపాధిహామీ నిధులతో చేపడుతున్న తోటపల్లి కాలువ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సౌత్‌సెంట్రల్ రైల్వేబోర్డు సభ్యుడు అంబళ్ల శ్రీరాములునాయుడు, సతివాడ సర్పంచ్ రేవళ్ల శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, స్థానిక నాయకుడు ఎల్లంనాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ గౌరినాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ పైడిరాజు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి 'ఇన్నర్ వీల్' ప్రాధాన్యం



వేదికపై ఉన్న ఇన్నర్‌వీల్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు

విజయనగరం: ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ సామాజిక ప్రాయోజిత కార్యక్రమాలు నిర్వహిస్తామని ఇన్నర్ వీల్ ఇంటర్నేషనల్ పాస్ట్ ట్రెజరర్ శరిత లునానీ వెల్లడించారు. పట్టణంలోని రింగ్ రోడ్డులో ఉన్న సుజాత కన్వెన్షన్ హాలులో సోమవారం ఇన్నర్ వీల్ డిస్ట్రిక్ట్ లెవెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విజయనగరం నుంచి కృష్ణాజిల్లా వరకు ఉన్న క్లబ్‌ల నుంచి ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా శరిత లునానీ మాట్లాడుతూ.. గత ఏడాది క్లబ్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో కోట్లాది రూపాయలు వెచ్చించి సేవా కార్యక్రమాలు చేపట్టమన్నారు. ఈ ఏడాది విద్య, ఆరోగ్యం రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ సమాజానికి సేవలందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎ.లక్ష్మీశ్రీనివాస విజయనగరం క్లబ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2023-24 సంవత్సరంలో విశిష్ట సేవలందించిన క్లబ్‌లకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు జి.శిరీష, పి.రూపవతి, కాపుగంటి సుధ, డి.ఉమాబాలాజీ, శ్రీదేవితో పాటు వందలాది మంది మహిళా సభ్యులు పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 8 వినతులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 వినతులు వచ్చాయి. కమిషన్ ఎం.మల్లయ్యనాయుడు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని సంబంధిత విభాగాల అధికారులకు అందజేసి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 1, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 3, శానిటేషన్‌కు సంబంధించి 1, రెవెన్యూ విభాగానికి సంబంధించి 2, హౌసింగ్‌కు సంబంధించి 1 వినతులు అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారానికి త్వరిత గతిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏసీపీ అమ్మాజీరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఈఈ కె.శ్రీనివాసరావు, మేనేజర్ ప్రసాదరావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.